క్లుప్తంగా

గడప గడపకూ సంక్షేమం



పశివేదల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొవ్వూరు: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పశివేదలలో గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావు ఇంటింటి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను వివరించారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మండల పార్టీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

గోపాలపురం: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండడం అవసరమని, చట్టం కల్పిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కొవ్వూరు న్యాయవాది పీపీ లక్ష్మి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద శనివారం డ్వాక్రా సీఏ, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల లీగల్ సర్వీసు కమిటీ ద్వారా మహిళలు ఉచిత న్యాయసలహాలు తీసుకోవచ్చన్నారు. వివాహాలకు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. న్యాయవాది జె.చంద్రశేఖర్, పీఎల్ రత్న కిషోర్, ఏపీఎం కె సుజినీ, రసూల్ బేగం, వెంకటలక్ష్మి డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

గోపాలపురం: గ్రామ స్థాయిలో వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై వైద్యులు, వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ కె.రమేష్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం హుకుంపేట, అన్నదేవరపేట వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక గ్రామాల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్షా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలకు కూడా తగిన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యులకు సూచించారు. డాక్టర్లు ఎస్ గాయత్రి,కె నవ్యశ్రీ, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కొత్త మోటార్ల ఏర్పాటుకు చర్యలు

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని మండలంలోని 15 సచివాలయాలకు గోదావరి నీటిని శుద్ధి చేసి సరఫరా చేసే మంచి నీటి పథకం సక్రమ నిర్వహణకు కొత్త మోటార్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎన్.అప్పారావు తెలిపారు. ఆయన శనివారం తాళ్లపూడిలోని వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. మోటార్లు పాడవడంతో మూడు రోజులుగా మండల వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో డీఈ అప్పారావు మండల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మోటార్లను మరమ్మతులు చేసి మోటార్లు బిగిస్తామని, రెండు మోటార్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట మండల ఏఈ షేక్ సూర్జాన్ ఉన్నారు.

స్వామి రామానంద భారతీజీ జయంతి

నల్లజర్ల: అనంతపల్లిలోని స్వర్ణదుర్గాశ్రమ వ్యవస్థాపక పీఠాధిపతులు స్వామి రామానందభారతీజీ 109వ జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి ఆనంద నారాయణ భారతీస్వామి ఆధ్వర్యంలో ఉదయం పూజలు, పంచామృతాభిషేకాలు, స్వర్ణదుర్గాంబకు కుంకుమ పూజలు, పాదపూజలను మానేపల్లి శ్రీనివాసరావు, సుధారాణి దంపతులు చేశారు.అనంతపల్లి ప్రసన్నవిఘ్నేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అనంతరం రామానంద భారతీ మహారాజ్ ట్రస్టు సమావేశం జరిగింది.

ఎస్ఆర్‌కే కళాశాల చైర్మన్ మృతి

నల్లజర్ల: స్థానిక ఎస్ఆర్‌కే కళాశాల చైర్మన్ కంతమణి నారాయణ ప్రసాద్(59) శనివారం మధ్యాహ్నం హైదరాబాదులో మృతి చెందారు. ఆదివారం ఆయన స్వగ్రామం అనంతపల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమీప బంధువు తెలిపారు. గత నెలలో ఆయన కారు డ్రైవ్ చేసుకుంటూ కళాశాల నుంచి ఇంటికి వస్తుండగా కారు అదుపుతప్పి రోడ్డు పక్క గోతిలో తిరగబడిపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నల్లజర్ల, తణుకు, హైదరాబాదు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. చికిత్స జరుగుచుండగానే అపస్మారక స్థితికి వెళ్లి శనివారం మృతి చెందారు. ఆయన భార్య వసుంధరాదేవి అనంతపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు ఉన్నారు. ఈయన తండ్రి శ్రీనివాసరావు రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రసాద్ మృతికి సహకార కళాశాల అధ్యాకులు, అధ్యాపకేతర సిబ్బంది, డైరెక్టర్లు నివాళులర్పించారు.

మహిళ అరెస్టు

నిడదవోలు రూరల్: కోరుమామిడిలో సారా విక్రయిస్తున్న కోరుమామిడికి చెందిన మోతే నరసమ్మను అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ శనివారం తెలిపారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చరిత్రాత్మకం

- ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

చాగల్లు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేయడం చరిత్రాత్మక నిర్ణయం అని కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. బ్రాహ్మణగూడెం గ్రామంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు పట్టాలు శనివారం అందజేశారు. జగనన్న కాలనీలో నివేశన స్థలాలు ఇచ్చిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను ఎమ్మెల్యే తలారీ వెంకట్రావు అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆస్తిగా నివేశన స్థలంపై పూర్తి హక్కు కల్పించారని లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని తెలిపారు. పేదలకు సొంత ఇంటిని కల్పించడంతో వారి జీవితాలు వెలుగులు వచ్చాయన్నారు. లబ్ధిదారులు తమకు ఇచ్చిన పట్టాలను సచివాలయ కేంద్రాల నుంచి వెంటనే పొంది ఇంతవరకు గృహాలు నిర్మించుకోని వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన్, ఎంపీపీ మట్టా వీరస్వామి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు సర్పంచ్ గురువెల్లి కుమారి, కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, ఎంపీటీసీలు పత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉసురుమర్తి జ్యోతి, ఉప సర్పంచ్ పత్తిపాటి సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

పేదల సొంతింటి కల సాకారం చేసిన జగనన్న

కొవ్వూరు: పేదవాడికి సొంతింటి కల సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు పేర్కొన్నారు.శ నివారం కాపవరం గ్రామంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సర్పంచ్ సుంకర పద్మిని, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఉపసర్పంచ్ గోతం మేరిఝాన్సీ, నాయకులు వెంపాటి సురేష్, ఏఎంసీ డైరెక్టర్ సుంకర రంగారావు, నాయుకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మరోసారి పట్టం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- తీపర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం

పెరవలి: సార్వత్రిక ఎన్నికల్లో పేదలకు, పెత్తందార్లకు మధ్య ఎన్నికల యుద్ధం జరుగుతుందని, ఈ యుద్ధంలో ప్రజా సంక్షేమ సారథి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. తీపర్రులో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కుందుల భూపతిరావు ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వమని నమ్మకానికి నెలువెత్తు జగన్‌మోహన్ రెడ్డి అయితే, అబద్దానికి నిలువెత్తు నిదర్శనం చంద్రబాబునాయుడని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ ప్రభుత్వంలో సంక్షేమం అందని కుటుంబం లేదని, అభివృద్ధి జరగని గ్రామంలేదని అటువంటి ప్రభుత్వానికి మరో సారి మీరంతా అండగా ఉండాలని, మరోసారి పట్టం కట్టాని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు ఎంపిపి కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరమళ్ళు సత్యనారాయణ, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

శ్రీకృష్ణదేవరాయలు చిరస్మరణీయుడు

ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: కులం మతం, ప్రాంతం చూడకుండా సువిశాల సామ్రాజ్యాన్ని ఏలిన మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు చిరస్మరణీయడని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. కానూరులో శ్రీ కృష్ణదేవరాయులు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్న దాని నిలువెత్తు నిదర్శనమని, ఆయన పాలనలో కవులు ఏలిన రాజ్యమన్నారు. ఇంతటి మహానీయుడి విగ్రహం ఆవిష్కరించటం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కల్యాణ మండపానికి నిధులు ఇవ్వాలని కోరడంతో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య, రంగ వెంకటేశ్వర రావు, సర్పంచ్ భావన మధు, వైఎస్సార్ నాయకులు కొమ్మిశెట్టి రాము, అంబటి బ్రహ్మయ్య, ఆలం సుబ్బారావు, కొమ్మిశెట్టి కిచ్చు తదితరులు పాల్గొన్నారు.



కానూరులో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

రైల్వే స్టేషన్‌లో మద్యం పట్టివేత

నిడదవోలు: స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ రైల్వే జిల్లా సూపరింటెండెంట్ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తన సిబ్బందితో నిడదవోలు రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. అదే సమయంలో తాడేపల్లిగూడేనికి చెందిన యాంగిన వీరవెంకట సత్యనారాయణ శేషాద్రి ఎక్స్‌ప్రెస్ నుంచి దిగి వెళుతుండగా, అతని బ్యాగ్‌లు తనిఖీ చేశారు. సుమారు రూ.లక్ష విలువైన 62 మద్యం ఫుల్ బాటిళ్లను గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, వాటిని తాడేపల్లిగూడెం రైల్వే పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై శ్రీహరిబాబు

పుల్లలపాడులో డెంగీ కేసు నమోదు

నల్లజర్ల: పుల్లలపాడు గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్టు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు పి.ప్రసాద్ తెలిపారు. అంగన్‌వాడీ సమీపంలో ఉంటున్న కొడగళ్ల దుర్గారావు(40) ఈనెల16వ తేదీన జ్వరం వచ్చిందని స్థానికంగా మందులు వాడినా తగ్గకపోవడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ 21న శాంపిల్ తీసుకున్నారని, 23న డెంగీ పాజిటివ్‌గా వెల్లడించారు. ప్రస్తుతం రోగి పరిస్థితి బాగానే ఉందని, శనివారం బాధితుని ఇంటిని వైద్యుల బృందం పరిశీలించిందని హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. ఎక్కడ ఎటువంటి నీటి గుంటలు లేవని సీహెచ్‌ఓ తెలిపారు. అయినప్పటికీ గ్రామం అంతా యబిట్ స్ప్రేచేయించుతున్నట్లు ఆయన తెలిపారు. మరో పక్క నాలుగు బృందాలు ఇంటింటా జ్వరాల సర్వే చేస్తున్నట్టు చెప్పారు. రాత్ర వేళలో దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్లు తెల్లంగంగాధరరావు, డాక్టరు సిరాజుద్దీన్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



గ్రామంలో దోమల లార్వాలను పరిశీలిస్తున్న వైద్యుల బృందం

ఇంట్లో చోరీ

బంగారం, వెండి, రూ.44 వేల నగదు అపహరణ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విలువైన వస్తువులు అపహరించుకుపోయినట్టు ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ శనివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... సమిశ్రగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ సయ్యద్ మీరాన్ జానీ స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో గత ఆరేళ్లుగా నివాసం ఉంటున్నారు. ఈ నెల పదో తేదీన హైదరాబాద్‌లోని ఉన్న కుమారుడి వద్దకు మీరాన్‌జానీ కుటుంబ సభ్యులు వెళ్లి తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపు తాళం పగులకొట్టి ఉండడం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమిశ్రగూడెం ఎస్సై రమేష్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బీరువాలో పెట్టిన 5 కాసుల విలువ చేసే రెండు బంగారు చైన్లు, నాలుగు ఉంగరాలు, 10 తులాల రెండు వెండి గిన్నెలు, మరో రూ.44 వేల నగదును అపహరించినట్టు సయ్యద్ మీరాన్ జానీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై రమేష్

ఘనంగా కోటసత్తెమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం: పసలపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోటసత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన శనివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, సర్పంచ్ కట్టా లక్ష్మి, ఎంపీటీసీ కట్టా విజయలక్ష్మి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేత్రదానం

తాళ్లపూడి: పెద్దేవం గ్రామానికి చెందిన జమ్ముల సూర్యారావు(87) శనివారం మృతి చెందారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు సూర్యారావు నేత్రాలను దానం చేశారు. కుమారులు బాపినీడు, సుబ్రహ్మణ్యం, కుమార్తెలు చలపాటి సత్యవతి, ఆత్కూరి నళిని సమాచారం ఇవ్వడంతో నిడదవోలు రాజేశ్వరీ లయన్స్ నేత్ర వైద్యాశాల సిబ్బంది కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

కొవ్వూరుపై వీడని సస్పెన్స్

- ఫస్ట్ లిస్టులో కొవ్వూరుకి నో ఛాన్స్
- అయోమయంలో టీడీపీ, జనసేన శ్రేణులు

కొవ్వూరు: టీడీపీ – జనసేన కూటమికి సంబంధించి కొవ్వూరు అభ్యర్థిపై సస్పెన్స్ తొలగలేదు. టీడీపీ ప్రకటించిన మొదటి జాబితాలో కొవ్వూరు అభ్యర్థి పేరు ప్రకటించకపోవడంతో ఆ పార్టీల శ్రేణులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ స్థానాన్ని గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అధిష్టానం కేటాయించిందని, ప్రకటనే తరువాయి అని టీడీపీ శ్రేణులు ఇప్పటి వరకూ ప్రచారం చేసుకున్నాయి. దీనికి టీడీపీలోని రెండు వర్గాలూ అంగీకారం తెలిపినట్లు ప్రచారం చేశారు. మరోవైపు మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు ఇస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం ఊదరగొట్టారు. వీరిద్దరిలో ఎవరికైనా ఇస్తారా లేక వీరిని పక్కన పెట్టి కొత్తవారికి ఇస్తారా అనే అంశంపై ఇప్పటి వరకూ స్పష్టత లేదు. టీడీపీ – జనసేన పొత్తు నేపథ్యంలో ఈ స్థానాన్ని ఏ పార్టీకి కేటాయిస్తారనేదీ కూడా స్పష్టం చేయలేదు. నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాటలు, జనసేనలో గ్రూపుల నేపథ్యంలోనే కొవ్వూరును పెండింగ్‌లో ఉంచారని అర్థమవుతోంది. మరోవైపు ఆశావహుల ఆశలపై తొలి జాబితా నీళ్లు జల్లింది. జిల్లా అధ్యక్షుడి హోదాలో ఉన్న మాజీ మంత్రి కేఎస్ జవహర్ కొవ్వూరుపై కోటి ఆశలు పెట్టుకున్నారు. దీనికోసం గతంలో కృష్ణా జిల్లాలో కేటాయించిన తిరువూరు స్థానంపై సూతం ఐదేళ్ల నుంచి ఆశలు వదులుకున్నారు. ఇప్పుడు ఆయనకు కొవ్వూరులోనూ ఆశలు సన్నగిల్లుతున్నాయి. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు సైతం ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కొవ్వూరు స్థానాన్ని తమ పార్టీకే కేటాయిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్న ఆయన కూడా ఫస్ట్ లిస్ట్‌లో ఏవిధమైన స్పష్టతా లేకపోవడంతో అయోమయంలో పడ్డారు.